## మీ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చెక్ చేయొచ్చు!

**అమెరికా వెళ్లే ప్రయాణికులకు పెరిగిన తనిఖీలు**

న్యూఢిల్లీ: అమెరికాకు వెళ్లేవారి ఎలక్ట్రానిక్ డివైస్‌లను తనిఖీ చేసే అధికారం ఆ దేశ కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ)కి ఉంది. అమెరికాలో ప్రవేశించేవారి వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తనిఖీ చేసే చట్టబద్ధ అధికారం సీబీపీ అధికారులకు ఉంది. ప్రయాణికుల పౌరసత్వం, వీసా స్టేటస్ వంటి వాటితో సంబంధం లేకుండా తనిఖీ చేస్తారు.

**తనిఖీలు రెండు విధాలుగా..**

బేసిక్ సెర్చ్, అడ్వాన్స్‌డ్ సెర్చ్ అనే రెండు విధాలుగా ఎలక్ట్రానిక్ డివైస్‌ల తనిఖీలు జరుగుతాయి. బేసిక్ సెర్చ్‌లో సీబీపీ ఆఫీసర్ డివైస్‌ను తనిఖీచేస్తారు. అన్‌లాక్ అయి ఉన్నా, ప్రయాణికుడు పాస్‌వర్డ్‌ను ఇచ్చినా సరిపోతుంది. అడ్వాన్స్‌డ్ సెర్చ్‌లో, డివైస్‌లో డాటాను ఎక్స్‌టర్నల్ టూల్స్‌తో యాక్సెస్, కాపీ, అనలైజ్ చేస్తారు.

**అమెరికాకు వెళ్లేవారి హక్కులు**

**గ్రీన్‌కార్డ్ హోల్డర్స్:** రెసిడెన్సీ స్టేటస్‌పై ప్రభావం పడటానికి ముందు గ్రీన్‌కార్డ్ హోల్డర్ వాదనను అధికారులు వినాలి. ఇది గ్రీన్ కార్డ్ హోల్డర్ల హక్కు.

**వీసా హోల్డర్స్:** ఎలక్ట్రానిక్ డివైస్‌లను అన్‌లాక్ చేయడానికి తిరస్కరించే వీసా హోల్డర్స్‌కు అమెరికా ప్రవేశాన్ని నిరాకరించవచ్చు.

నిపుణుల సలహా ఏమిటంటే, మీ పాస్‌వర్డ్‌ను అధికారులకు చెప్పడానికి బదులుగా, మీరే ఎంటర్ చేయండి, ఆ తర్వాత దానిని మార్చుకోండి.

**డాటాను కాపాడుకోవడం ఎలా?**

**ట్రావెల్ లైట్:** తక్కువ వ్యక్తిగత డాటాతో వేరుగా ఓ ట్రావెల్ డివైస్‌ను ఉపయోగించాలి. యాప్స్ నుంచి సైన్ ఔట్ అవాలి. ఆటో-లాగిన్స్‌ను డిజేబుల్ చేయాలి.

**బ్యాకప్:** ముఖ్యమైన ఫైల్స్‌ను క్లౌడ్ సర్వీసులో లేదా ఎక్స్‌టర్నల్ డ్రైవ్‌లో సేవ్ చేయాలి. సీబీపీ.. డివైస్‌లో ఫిజికల్‌గా ఉన్న వాటినే సోదా చేయగలదు. క్లౌడ్‌లో స్టోర్ చేసిన డాటాను యాక్సెస్ చేయలేరు.

## భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

- **భరత ముని రచించిన నాట్యశాస్త్రానికి కూడా..**
- **మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో చోటు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారతదేశ వారసత్వ సంపదలు భగవద్గీత, భరత ముని రచించిన నాట్యశాస్త్రం రాతప్రతులు యునెస్కోకు చెందిన మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ రిజిస్టర్‌లో కొత్తగా చేర్చిన 74 డాక్యుమెంటరీ వారసత్వ సంపదలలో వైజ్ఞానిక విప్లవం, చరిత్రలో మహిళల పాత్ర, 72 దేశాలు, నాలుగు అంతర్జాతీయ సంస్థల బహుళ పక్ష అంశాలకు చెందిన ప్రధాన మైలురాళ్లు ఉన్నట్లు యునెస్కో తెలిపింది. రిజిస్టర్‌లో గ్రంథాలు, రాతప్రతులు, చిత్రపటాలు, ఫొటోలు, శబ్ద లేక వీడియో రికార్డింగులు మానవాళికి చెందిన వారసత్వ డాక్యుమెంటరీగా పొందుపరిచి ఉన్నాయి. ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో భగవద్గీత, నాట్య శాస్త్ర గ్రంథాలు చోటు దక్కించుకోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ ఇవీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయునికి గర్వించే క్షణాలని చెప్పారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోందని, ఈ రచనలు మనదేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులని మంత్రి షెకావత్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయని తెలిపారు. క్రీస్తు పూర్వం 2వ శతాబ్దంలో భరత ముని రచించిన నాట్యశాస్త్రంలో మొత్తం 36,000 శ్లోకాలు ఉన్నాయి. గంధర్వ వేదగా పిలిచే ఈ శ్లోకాలు నాట్యశాస్త్ర సారాన్ని సంపూర్ణంగా తెలియచేస్తాయి. ఇక మహాభారత యుద్ధ రంగంలో హితులు, సోదరులు, గురువులు, బంధు జనులను చూసి అస్త్ర సన్యాసం చేసిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధను భగవద్గీతగా భారతీయులు విశ్వసిస్తారు. ఇందులో 18 అధ్యాయాలలో మొత్తం 700 శ్లోకాలు ఉన్నాయి.

## అమెరికా వీసాలు రద్దయిన విద్యార్థుల్లో
# 50% భారతీయులే

### వర్క్ పర్మిట్లు ఉన్నా ఎఫ్-1 వీసాల రద్దు.. అమెరికన్ లాయర్ల సంఘం ప్రకటన




న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఇటీవల అమెరికాలో వీసాల రద్దు లేదా స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సెవీస్) రికార్డుల నుంచి తొలగింపునకు గురైన అంతర్జాతీయ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది భారతీయులేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్(ఏఐఎల్ఏ) వెల్లడించింది. ఇందుకు సంబంధించి విద్యార్థులు, న్యాయవాదులు, యూనివర్సిటీ ఉద్యోగుల నుంచి 327 కేసు నివేదికలను ఈ సంఘం సేకరించింది. ఈ అంతర్జాతీయ విద్యార్థులలో సగం మంది భారతదేశానికి చెందిన వారు కాగా 14 శాతం మంది చైనా విద్యార్థులని ఏఐఎల్ఏ తెలిపింది. మిగిలిన విద్యార్థులు ప్రధానంగా దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన వారని గురువారం వెల్లడించింది.

**50% మంది ఓపీటీ విద్యార్థులే**

2023-24లో అమెరికాలో చేరిన అంతర్జాతీయ విద్యార్థులలో అత్యధికులు భారతీయులేనని, మొత్తం 11,26,690 మంది అంతర్జాతీయ విద్యార్థులలో 3,31, 602 మంది (29 శాతం) భారతీయులేనని ఓపెన్ డోర్స్ డాటా పేర్కొంది. వీరి తర్వాత 2.77 లక్షల మందితో చైనా రెండవ స్థానంలో ఉంది. వీరిలో 50 శాతం మంది విద్యార్థులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ)లో ఉన్నారని, అంటే వీరంతా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారని ఏఐఎల్ఏ తెలిపింది. ఎఫ్-1 వీసాపై అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులు 12 నెలలు పనిచేయవచ్చు. అదే స్టెమ్ కోర్సుల విద్యార్థులైతే మరో 24 నెలలు తమ వీసాను పొడిగించుకోవచ్చు. సెవీస్ రికార్డు నుంచి తొలగింపునకు గురైన ఓపీటీ విద్యార్థులు వెంటనే ఉద్యోగాలు చేసేందుకు వీల్లేదని, ప్రస్తుతం చదివే విద్యార్థులతో పోలిస్తే ఓపీటీ కింద ఉద్యోగాలు చేస్తున్న వారు తమ పాత హోదా పొందడం దుర్లభమని ఏఐఎల్ఏ తెలిపింది. 2023-24లో 3.32 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉండగా వీరిలో 97,566 మంది విద్యార్థులు ఓపీటీలో ఉన్నారని ఏఐఎల్ఏ పేర్కొంది.

**ఏకపక్షంగా వీసాల రద్దు**

అంతర్జాతీయ విద్యార్థుల వీసాల రద్దు ఏకపక్షంగా జరుగుతున్నట్లు ఏఐఎల్ఏ ఆందోళన వ్యక్తం చేసింది. తాము సేకరించిన కేసుల నివేదికలలో 86 శాతం కేసులు ఏదో ఒక స్థాయిలో పోలీసులతో సంప్రదింపులకు నోచుకున్నాయని, 33 శాతం వీసాలు రద్దయిన కేసులలో అభియోగాలు నమోదు చేయకపోవడం, వారిపై కేసులు కట్టకపోవడం జరిగినట్టు ప్రకటన తెలిపింది.

**చిన్న చిన్న కారణాలతో..**

గంటకు 65 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సిన జోన్‌లో 70 కిలోమీటర్ల వేగంతో డ్రైవ్ చేయడం, చట్టవిరుద్ధంగా వాహనం పార్కింగ్ చేయడం, సీటు బెల్టు ధరించకపోవడం, నెంబర్ ప్లేట్లు గడువు తీరిపోవడం వంటి చిన్న చిన్న అభియోగాలతో పోలీసుల నుంచి ఓపీటీ విద్యార్థులకు నోటీసులు అందాయి. వీసా రద్దుకు గురైన విద్యార్థులలో ఇద్దరు విద్యార్థులకు మాత్రమే రాజకీయ నిరసనలలో పాల్గొన్న చరిత్ర లేదని ఏఐఎల్ఏ తెలిపింది. వీసా రద్దుకు సంబంధించిన ఈమెయిల్ నోటీసులు అందుకున్న మెజారిటీ విద్యార్థులకు ఈ నోటీసు వీసాను మంజూరు చేసిన కాన్సులేట్ నుంచి వచ్చినట్లు ఏఐఎల్ఏ పేర్కొంది. కాగా, అమెరికాలో వీసాలు రద్దయిన భారతీయ విద్యార్థుల గురించి విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌ను గురువారం విలేకరులు ప్రశ్నించగా చాలామంది భారతీయ విద్యార్థులకు నోటీసులు అందిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

**వీసా అపాయింట్‌మెంట్ స్లాట్లు అదృశ్యం!**

ఈ విద్యా సంవత్సరం వేగంగా సమీపిస్తున్న వేళ అమెరికా స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల స్లాట్లు హఠాత్తుగా అదృశ్యం కావడం పట్ల భారత విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అయితే అనధికారిక యాక్సెస్‌ను నివారించే ఉద్దేశంతో సిస్టమ్ అప్‌గ్రేడ్ చేస్తుండడం వల్లే సాంకేతిక లోపం తలెత్తి ఉండవచ్చని భావిస్తున్నారు.

### వెయ్యి మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు

అమెరికాలో విద్యనభ్యసిస్తున్న 1,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను ప్రభుత్వం రద్దు చేసింది. వారిలో చాలామంది భారతీయులు ఉన్నారు. ఏ క్షణంలోనైనా తమను దేశం నుంచి బహిష్కరిస్తారేమోనన్న భయం వారిని వెంటాడుతున్నది. అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం మార్చి నుంచి హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ వంటి ప్రముఖ విద్యాసంస్థల తోపాటు దేశంలోని 160 కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన 1,024 మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేశారు.

## 20% తగ్గిన ఐటీ నియామకాలు

- **ఉన్న కొలువుల్లో కోతలకూ అవకాశం**
- **అమెరికా సుంకాల పెంపే కారణం**

న్యూఢిల్లీ: అమెరికా ప్రారంభించిన ప్రపంచ సుంకాల యుద్ధం కారణంగా భారత సాఫ్ట్‌వేర్ రంగంలో కొత్త ఉద్యోగుల నియామకానికి బ్రేక్ పడింది. టీమ్‌లీజ్ డాటా ప్రకారం గత త్రైమాసికంతో పోలిస్తే ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత టెక్ రంగంలో టాలెంట్ డిమాండ్ 18-20% తగ్గింది. ఎక్స్‌ఫెనో డాటా ప్రకారం ఫిబ్రవరిలో 80 వేలుగా ఉన్న ఐటీ నియామకాల డిమాండ్ మార్చి నాటికి 55 వేలకు పడిపోయింది. మరోవైపు ఇండియన్ టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నదని ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కారంత్ అభిప్రాయపడ్డారు. మార్చి నెలలో సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ స్టార్టప్‌లలోనూ ఉద్యోగాల నియామకాలు 5 వేలు దాకా తగ్గాయి. ఐటీ సెక్టార్‌లో ఓవరాల్ జాబ్ డిమాండ్ 45 నుంచి 40 శాతానికి తగ్గింది. ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించే అవకాశం వెంటనే లేకపోయినా సాధారణ స్థాయిలో కోతలు ఉండే అవకాశం ఉంది. అమెరికా రక్షణాత్మక విధానాలు సాంకేతిక వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి సారిస్తాయి. ఈ నేపథ్యంలో స్వల్పకాల ఒడిదొడుకులను అధిగమించడంపై భారత టెక్ దిగ్గజాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది.

**ఇన్ఫోసిస్‌లో 240 మంది ట్రైనీల తొలగింపు**

అంతర్గత మదింపు పరీక్షలో విఫలమైన 240 మంది ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. ఈ మేరకు వారికి శుక్రవారం ఈ-మెయిల్ పంపింది. అదనపు ప్రిపరేషన్ టైమ్ ఇచ్చినా జనరిక్ ఫౌండేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఫెయిల్ అయినందుకు వారిని తొలగిస్తున్నట్టు పేర్కొంది. అయితే బీపీఎం ఇండస్ట్రీలో ఉద్యోగాలు వెతుక్కొనేందుకు అవసరమైన శిక్షణను తమ సంస్థ ద్వారా వారికి అందిస్తామని వెల్లడించింది.

## జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫైనల్ కీ విడుదల

**నేడు ఫలితాల ప్రకటన**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫైనల్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం విడుదల చేసింది. ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలను విరమించుకున్నట్టు తెలిపింది. వాస్తవానికి గురువారమే ఫైనల్ కీని విడుదల చేసినప్పటికీ, గంటలోపే దానిని ఎన్టీఏ ఉపసంహరించుకుంది. దానికి కారణాలు తెలుపకపోవడంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తుది కీని మళ్లీ విడుదల చేసిన ఎన్టీఏ.. ఫలితాలను శనివారంలోగా ప్రకటిస్తామని వెల్లడించింది. రెండో విడత జేఈఈ మెయిన్ పరీక్షలను ఏప్రిల్ 2 నుంచి 8 వరకు ఎన్‌టీఏ నిర్వహించింది.



## వచ్చే నెలలో రోదసిలోకి భారత వ్యోమగామి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత్‌కు చెందిన వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసి ప్రయాణానికి రంగం సిద్ధమైంది. ఆక్సియమ్-4 మిషన్‌లో భాగంగా ఆయన వచ్చేనెల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పయనించనున్నారు. భారత్‌కు చెందిన ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేసిన నాలుగు దశాబ్దాల తర్వాత శుభాన్షు ఈ గౌరవాన్ని దక్కించుకోనున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ శుక్రవారం తెలిపారు. 'గ్రూప్ కెప్టెన్ శుక్లా ప్రయాణం కేవలం విమాన ప్రయాణం కాదు. అంతరిక్ష పరిశోధనల్లో కొత్త యుగంలోకి భారత్ ధైర్యంగా అడుగుపెడుతుందనడానికి ఇది సంకేతం' అని అన్నారు.

## జీపీఎస్ టోలింగ్‌పై నిర్ణయం తీసుకోలేదు

**రోడ్డు రవాణా, హైవేల శాఖ**

న్యూఢిల్లీ : ఫాస్టాగ్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని వచ్చే నెల 1 నుంచి మార్చుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ శుక్రవారం వివరణ ఇచ్చింది. ఫాస్టాగ్‌కు బదులుగా శాటిలైట్ విధానాన్ని అమలు చేయబోతున్నామన్న ప్రచారంలో వాస్తవం లేదంది. రోడ్డు రవాణా, హైవేల శాఖ కాని, ఎన్‌హెచ్‌ఏఐ కాని అటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్-ఫాస్టాగ్ హైబ్రిడ్ టోలింగ్ సిస్టమ్‌ను కొన్ని ఎంపిక చేసిన టోల్ ప్లాజాలలో అమలు చేయబోతున్నట్లు ప్రకటించింది.

## శాంతి ఒప్పందంపై పురోగతి లేకుంటే తప్పుకుంటాం

**ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా**

పారిస్ : రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో పురోగతి కనిపించకపోతే, చర్చల ప్రయత్నాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మానుకుంటారని ఆ దేశ విదేశాంగ మంత్రి రుబియో స్పష్టంచేశారు. ''మరికొద్ది వారాల్లో ఇది సాధ్యమవుతుందా? లేదా? సాధ్యమైతే మేం ఉంటాం, లేదంటే, మేం దృష్టి పెట్టవలసిన ఇతర ముఖ్య విషయాలు ఉన్నాయి' అని పారిస్‌లో యూరోపియన్, ఉక్రెయినియన్ నేతలతో సమావేశం అనంతరం చెప్పారు. ఒప్పందంలో పురోగతి కనిపించకపోతే, ఇక విరమించుకోవాలని ట్రంప్ అనుకుంటున్నారని తెలిపారు.



**అమెరికాలో రోడ్డు ప్రమాదం..**

## తెలుగు విద్యార్థిని దుర్మరణం

హైదరాబాద్: అమెరికాలో వాహనం ఢీకొని తెలుగు విద్యార్థిని మృతి చెందింది. ఏపీలోని గుంటూరుకు చెందిన వీ దీప్తి యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో ఎంఎస్ చదువుతున్నది. ఈ నెల 12న టెక్సాస్‌లోని డెంటాన్ సిటీలో తన జిల్లాకే చెందిన స్నేహితురాలు స్నిగ్ధతో కలిసి నడుచుకుంటూ వస్తుండగా, వేగంగా వచ్చిన ఒక వాహనం వారిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో దీప్తి చికిత్స పొందుతూ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన స్నిగ్ధ ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

**రాజ్యసభ చైర్మన్ నోటి వెంట**

## రాజకీయాలా?

**ఎంపీ కపిల్ సిబల్ ఆశ్చర్యం**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: చట్టసభలు ఆమోదించిన తర్వాత గవర్నర్ పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో న్యాయవ్యవస్థపై రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ విమర్శలు చేయడాన్ని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ తప్పుబట్టారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఒక రాజ్యసభ చైర్మన్ ఇలా రాజకీయ ప్రకటనలు చేయడం గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతికి వ్యక్తిగత అధికారాలు ఉండవని, ఆ పదవిలో ఉన్న వారు నామమాత్రపు అధిపతి మాత్రమేనని, వారు మంత్రి మండలి సహాయం, సలహాలపై మాత్రమే పనిచేస్తారని స్పష్టం చేశారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌లు అధికార, విపక్ష పార్టీలకు సమాన దూరాన్ని పాటించాలే తప్ప ఒక పార్టీ ప్రతినిధిగా వ్యవహరించ కూడదని అన్నారు. 'స్పీకర్, చైర్మన్ స్థానంలో ఉన్నప్పుడు వారు పార్టీ ప్రతినిధులుగా వ్యవహరిస్తూ మాట్లాడరాదు. అలా మాట్లాడితే ఆ కుర్చీకి ఉన్న గౌరవాన్ని దిగజార్చినట్టు అవుతుంది' అని అన్నారు.

## యెమెన్ ఆయిల్ పోర్ట్‌పై అమెరికా భీకర దాడి

**74 మంది మృతి, 171 మందికి గాయాలు**

దుబాయ్: యెమెన్‌లోని రస్ ఇసా ఆయిల్ పోర్టుపై అమెరికా భీకర దాడులు చేసిందని హౌతీ ఉగ్రవాదులు శుక్రవారం ప్రకటించారు. ఈ దాడిలో 74 మంది మరణించారని, 171 మంది గాయపడ్డారని చెప్పారు. ఈ ఉగ్రవాదులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నిర్వహిస్తున్న దాడుల్లో ఇదే అత్యంత భీకరమైనది. ఈ ఆయిల్ పోర్ట్ ద్వారా ఇరాన్ మద్దతు గల హౌతీ ఉగ్రవాదులకు నిధులు సమకూరుతున్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ చెప్పింది. వారికి ఆదాయాన్ని అందిస్తున్న ఈ చట్టవిరుద్ధ మార్గాన్ని నిర్మూలించడం కోసమే దాడి చేసినట్లు తెలిపింది. పదేళ్ల నుంచి హౌతీలు ఈ ప్రాంతాన్ని భయకంపితం చేస్తున్నారని మండిపడింది.

# ఢిల్లీ పాలనకు తలొగ్గేది లేదు

- **పార్టీలను చీల్చి ప్రభుత్వాల ఏర్పాటు ఇతర రాష్ట్రాల్లో చెల్లుతుందేమో..**
- **తమిళనాడులో పనిచేయదు**
- **కేంద్రానికి సీఎం స్టాలిన్ స్పష్టీకరణ**



తిరువళ్లూర్: మీ పప్పులు ఎక్కడైనా ఉడుకుతాయేమో కాని, మా వద్ద కాదని, ఢిల్లీ పాలకులకు తమిళనాడు ఎన్నడూ తల వంచదని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చే ఏ శక్తి కూడా ఎప్పటికీ దక్షిణాదిరాష్ట్రాన్ని పాలించ లేదని అన్నారు. తమిళనాడులోని విపక్ష ఏఐఏడీఎంకేతో బీజేపీ ఎన్నికల పొత్తు పెట్టుకున్న క్రమంలో 2026లో తామే అధికారంలోకి వస్తామని అమిత్ షా ప్రకటించడంపై తిరువళ్లూర్ సభలో ఆయన మాట్లాడుతూ 'నేను ఆయనకు సవాల్ విసురుతున్నా.. భయపెట్టి, పార్టీలను చీల్చే, కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించే కేంద్రం వేధింపుల ఫార్ములా దేశంలో ఎక్కడైనా పనిచేస్తుందేమో కానీ తమిళనాడులో మాత్రం పనిచేయదు. అమిత్ షాయే కాదు, ఏ షా కూడా తమిళనాడును పాలించలేరు' అని అన్నారు. తమ ప్రభుత్వానికి నిజాయితీ లేదని, ప్రజలు అనాగరికులంటూ ఇటీవల కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన విమర్శలను ఆయన ప్రస్తావిస్తూ.. అలాంటి వ్యాఖ్యల ద్వారా రాష్ట్రాన్ని విభజించాలనుకునే అలాంటి ప్రయత్నాలు తప్పక విఫలమవుతాయని అన్నారు.

**ఆ సమస్యలపై సమాధానం చెబుతారా?**

నీట్, త్రిభాషా విధానాలపై తాము దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తున్నామని విమర్శించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఆ సమస్యలపై రాష్ట్ర ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పగలరా? అని స్టాలిన్ సవాల్ చేశారు. నీట్, త్రిభాషా పాలసీ, వక్ఫ్ బిల్లు వల్ల కొన్ని రాష్ట్రాలు ప్రభావితం అవుతాయని, అందుకే తాము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన చెప్పారు.

## 'రేప్ కేసులుగా మారుతున్న విఫల బంధాలు'

ప్రయాగ్‌రాజ్ : విఫలమైన ప్రేమబంధాలు క్రిమినల్ చట్టాల దుర్వినియోగానికి దారితీస్తున్నాయని వ్యాఖ్యానిస్తూ అత్యాచార నిందితుడికి అలహాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. వ్యక్తిగత సంబంధాలు దెబ్బతినడం పెరిగిపోతోందని, ఎడబాటు వల్ల కలిగే భావోద్వేగానికి క్రిమినల్ రంగు పులమడం జరుగుతోందని, ముఖ్యంగా విఫలమైన సంబంధాలలో ఇది ఎక్కువగా కనపడుతోందని హైకోర్టు పేర్కొంది. తనపై అత్యాచారానికి పాల్పడినట్టు ఓ మహిళ(25) ఇచ్చిన ఫిర్యాదుపై ఓ వివాహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ఇద్దరు వ్యక్తులు భావోద్వేగంతో చేసిన ఆరోపణలే తప్ప ఇందులో క్రిమినల్ చర్యలేవీ లేవని వ్యాఖ్యానించింది.

## తువాలులో తొలి ఏటీఎం

న్యూఢిల్లీ : పసిఫిక్ దీవుల దేశం తువాలులో ఈ నెల 15న మొదటి ఏటీఎంను ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టం సందర్భంగా ప్రధాని ఫెలెటి టియో నాయకత్వంలో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఆయన భారీ చాకొలెట్ కేక్‌ను కట్ చేశారు. ఇది అద్భుత విజయమని వ్యాఖ్యానించారు. నేషనల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ సియోస్ టియో మాట్లాడుతూ, ప్రజల ఆర్థిక సాధికారతకు తలుపులు తెరిచే పరివర్తక మీట ఈ ఏటీఎం అని తెలిపారు. ఆస్ట్రేలియా-హవాయి మధ్య 10 చదరపు మైళ్ల వైశాల్యంలో ఈ దేశం ఉంది. తొమ్మిది దీవులతో కూడిన ఈ దేశంలో 11,200 మంది నివసిస్తున్నారు. పునపుటిలో ఎయిర్‌పోర్ట్ ఉంది. పొరుగున గల ఫిజీ నుంచి వారానికి కొన్ని విమానాలు మాత్రమే ఇక్కడికి వస్తాయి.

## ఆర్ట్స్ విద్యార్థులకూ పైలట్ లైసెన్స్!

**నిబంధనలను సడలించే యోచనలో డీజీసీఏ**

న్యూఢిల్లీ: విమాన పైలట్లుగా శిక్షణ, లైసెన్స్ పొందే అవకాశం ఆర్ట్స్, కామర్స్ చదివిన వారికీ రాబోతున్నది. పైలట్ శిక్షణ అర్హతల నుంచి పన్నెండో తరగతిలో భౌతిక శాస్త్రం, గణితం చదివి ఉండాలనే నిబంధనను తొలగించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) యోచిస్తున్నది. ఈమేరకు కేంద్ర విమానయాన శాఖకు సిఫారసు చేయబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఫ్లయింగ్ స్కూల్స్‌కు ర్యాంకింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టాలని కూడా డీజీసీఏ యోచిస్తున్నది. కమర్షియల్ పైలట్ లైసెన్స్ పూర్తి చేయడానికి అవసరమైన ఫ్లయింగ్ సమయం, భద్రత వంటి అంశాలను ఈ విధానం పరిగణనలోకి తీసుకుంటుంది. విమానయాన పరిశ్రమకు సిబ్బంది అవసరం పెరుగుతుండటంతో పైలట్ శిక్షణ విధానాన్ని సంస్కరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

## నెలాఖరులోగా బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

- **ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ విస్తరణ**
- **అగ్ర నేతల వరుస భేటీలతో జోరుగా ఊహాగానాలు**



న్యూఢిల్లీ: ఈ నెలాఖరులోగా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడి పేరును బీజేపీ ప్రకటించే అవకాశం ఉంది. కొత్త అధ్యక్షుడి నియామకం తరువాత కేంద్ర క్యాబినెట్ విస్తరణతోపాటు మార్పులు చేర్పులను కూడా ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈనెల 15న ప్రధాని నరేంద్ర మోదీ హఠాత్తుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కావడం, అదే సమయంలో పార్టీ అగ్ర నేతలు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో గంటలపాటు సమాలోచనలు జరపడంతో క్యాబినెట్ విస్తరణపై ఊహాగానాలు జోరందుకున్నాయి. 16న ప్రధాని మోదీ సమక్షంలో పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించి ఢిల్లీలో బీజేపీ అగ్ర నాయకత్వం మరో సమావేశం నిర్వహించింది. ఈ వరుస సమావేశాల అజెండా బయటపడనప్పటికీ పార్టీ తదుపరి అధ్యక్షుడి నియామకంలో జరుగుతున్న జాప్యం, మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో వీటికి ప్రాధాన్యం ఏర్పడింది.

**గత ఏడాదే ముగిసిన నడ్డా పదవీకాలం**

బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఈ ఏడాది జనవరిలోనే జరగవలసి ఉండగా పార్టీని మరింత బలోపేతం చేయగల నాయకుడిని జాగ్రత్తగా ఎంపిక చేసేందుకే ఈ జాప్యమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 2020 జనవరి నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జేపీ నడ్డా పదవీకాలాన్ని మూడేళ్ల గడువుకు మించి పార్టీ పొడిగించింది. మరో వారం లేదా రెండు వారాల్లో పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి ప్రకటన వెలువడొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వారిలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్ ఉన్నారు.

**రాజకీయాలు నాకు ఫుల్ టైం జాబ్ కాదు : యోగి ఆదిత్యనాథ్**

తాను రాజకీయాలను ఫుల్‌టైం జాబ్‌గా పరిగణించడం లేదని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇటీవల పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతారని, భావి ప్రధాని యోగి ఆదిత్యనాథేనని ప్రచారం జరుగుతున్న క్రమంలో ఇదే విషయాన్ని మీడియా ప్రస్తావించగా ఆయన పైవిధంగా స్పందించారు. 'చూడండి, నేను ఈ యూపీ రాష్ట్రానికి సీఎంని. ప్రజలకు సేవ చేసేందుకు పార్టీ నన్నిక్కడ నియమించింది. రాజకీయాలు నా పూర్తి వ్యాపకం కాదు. ప్రస్తుతం నేను ఇక్కడ సీఎంగా ఉన్నాను. కానీ వాస్తవానికి నేనొక యోగిని' అని పేర్కొన్నారు.

# మీ టూత్‌పేస్టులో లోహముందా?

### ప్రముఖ బ్రాండ్లలో హానికర పదార్థాలు



న్యూఢిల్లీ : సురక్షితం లేదా ప్రకృతి సిద్ధం అంటూ నిత్యం ఆకట్టుకునే ప్రకటనలు గుప్పించే డజన్ల కొద్దీ టూత్‌పేస్ట్ బ్రాండులలో చాలా వరకు సీసం, ఆర్సెనిక్, పాదరసం, కాడ్మియంతోసహా ప్రమాదకర భార లోహాలు ఉన్నాయన్న వాస్తవం తాజా పరిశోధనలో బయటపడింది. లాడ్ సేఫ్ మామా సంస్థ 51 టూత్‌పేస్టు, టూత్ పౌడర్ ఉత్పత్తులను థర్డ్-పార్టీ ల్యాబ్ పరీక్షలు నిర్వహించగా దిగ్భ్రాంతికర ఫలితాలు వెల్లడయ్యాయి. 90 శాతం ఉత్పత్తులలో సీసం ఉన్నట్లు వెల్లడి కాగా దీర్ఘకాలం ఆరోగ్యంపై ప్రభావం చూపే హానికరమైన లోహమైన ఆర్సెనిక్ 65 శాతం ఉత్పత్తులలో ఉన్నట్లు తేలింది. అయితే, ఆరోగ్యానికి హాని చేసే వీటిపై ఎవరికీ ఆందోళన లేకపోవడం ఆశ్చర్యకరమని లీడ్ సేఫ్ మామా వ్యవస్థాపకురాలు తమారా రూబిన్ పేర్కొన్నారు. క్రెస్ట్, సెన్సోడైన్, కోల్గేట్, టామ్స్ ఆఫ్ మైనే తదితర బ్రాండ్లకు చెందిన పేస్టులు, పౌడర్లలో ఆందోళనకరమైన ఫలితాలు బయటపడ్డాయని ఆమె చెప్పారు.

**పిల్లల టూత్‌పేస్టులు సైతం**

పిల్లలు వాడే టూత్‌పేస్టు బ్రాండ్లలో సగం వరకు(47శాతం)పాదరసం ఉన్నట్లు పరీక్షలో తేలిందని రూబిన్ చెప్పారు. 35 శాతం పిల్లల బ్రాండ్లలో మరో ప్రమాదకర భార లోహం కాడ్మియం ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. కొద్దిపాటి సీసం కూడా తీవ్ర ఆరోగ్య సమస్యలను సృష్టించగలదని ఆమె చెప్పారు. సీసం వల్ల ఆరేండ్ల లోపు పిల్లలలో బాగు చేయలేనంత మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటి పరిమాణం పెరిగితే అది ప్రాణనష్టం కూడా చేకూర్చగలదని ఆమె ఆందోళన చెందారు.

**ఏ బ్రాండ్లు హానికరం?**

ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షలలో అనేక ప్రముఖ బ్రాండ్లకు చెందిన టూత్‌పేస్టులు హానికరమని తేలింది. వీటిలో ఆర్గానిక్ లేదా డాక్టర్లచే సిఫార్సు చేయబడిన అంటూ ప్రకటనలు ఇచ్చేవి కూడా ఉండడం విశేషం. క్రెస్ట్, సెన్సోడైన్, టామ్స్ ఆఫ్ మైనే, కోల్గేట్, డాక్టర్ బ్రానర్స్ డేవిడ్స్, డాక్టర్ జెన్, డాక్టర్ బ్రైట్ మొదలైనవి ఈ హానికర బ్రాండ్ల జాబితాలో ఉన్నాయి.

**మీరేం చేయాలంటే...**

టూత్‌పేస్టులను కొనేముందు దానిపైన ప్రకృతి సిద్ధమైన లేదాఫ్లోరైడ్ రహిత వంటి లేబుల్స్ ఉన్నవైతే అవి సురక్షితం అని పూర్తిగా భావించనవసరం లేదు. టూత్‌పేస్టులో ఉన్న పదార్థాలు ఏమిటో నిశితంగా చదవాల్సి ఉంటుంది.

## చాట్‌ను అనువదించే వాట్సాప్ ఫీచర్!

న్యూఢిల్లీ: చాట్స్‌ను ఒక భాష నుంచి మరొక భాషకు అనువదించే ఫీచర్‌ను వాట్సాప్ పరీక్షిస్తున్నది. ఇది అందుబాటులోకి వస్తే, వాట్సాప్ యూజర్లు ఓ ఉమ్మడి భాష అవసరం లేకుండానే పరస్పరం సందేశాలు, భావాలను పంచుకోవచ్చు. ఉదాహరణకు, 'హలో' అని ఆంగ్లంలో ఓ యూజర్ సందేశాన్ని పంపిస్తే, దానిని స్వీకరించే హిందీ యూజర్లకు 'నమస్తే' అని వెళ్తుంది. వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.25.12.25లో కొత్త ట్రాన్స్‌లేషన్ సెట్టింగ్స్‌లో ఈ ఫీచర్ కనిపించింది. ఇది ప్రస్తుతం కొందరు బీటా టెస్టర్స్‌కు మాత్రమే అందుబాటులో ఉంది. రానున్న కొద్ది వారాల్లో బీటా చానల్‌లో అందుబాటులోకి వస్తుంది. యూజర్లందరికీ అందుబాటులోకి రావడం గురించి సమాచారం లేదు.